బాస్కెట్ బాల్ అండర్-14 జిల్లా జట్ల ఎంపిక

బాస్కెట్‌బాల్ అండర్-14 బాలబాలికల జట్లు

మదనపల్లె అర్బన్: బిటి కళాశాల బాస్కెట్‌బాల్ మైదానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిటిఎం, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 బాలబాలికల జట్లు ఎంపిక చేశామని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఎంపికల్లో పాల్గొన్న డివైఇఒ కృష్ణప్ప మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి అండర్-14 బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌ను ఇక్కడే నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎంపికలో 20 మంది బాలురు, 20 మంది బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు నాగరాజ, నరేష్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నరేంద్ర, సాయి శేఖర్‌రెడ్డి, సలీం, మదనపల్లె బాస్కెట్ బాల్ అసోసియేషన్ కోచ్ నటరాజ, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు అజీమ్, వెంకటేష్, మొయినుద్దీన్, భారతి, రాధిక, రమేష్, అన్సర్, సుధాకర్ పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీష పిఎస్ ఆర్‌డిఒలు, తహాశీల్దార్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఓటర్ల జాబితా సవరణపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా రూపకల్పనకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అన్ని ఫామ్స్ ఒక్కటి కూడా పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని చెప్పారు. ఫామ్స్ క్లియర్ చేయడంలో రాజకీయ పార్టీ నాయకులు విమర్శించడానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి ముఖ్యమైనదని18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌లతో సంప్రదించి 18 సంవత్సరాలు నిండి వారు ఇంకా ఓటర్‌గా నమోదు చేసుకోకుంటే అలాంటి వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చూడాలన్నారు. నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వందశాతం నమోదు కావాలన్నారు .క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దరఖాస్తులు ఎవరు తప్పు పట్టకుండా ఉండేటట్లు పరిష్కరించాలన్నారు. ఓటర్ లిస్టులో ఒకే రకమైన రెండు ఫొటోలుంటే అలాంటి నకిలీ ఓటర్లను తొలగించాలని, వివాహం అయిన మహిళలు ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు గుర్తించి ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు.ఎన్నికల నిర్వహణకు కేవలం నాలుగైదు నెలలు మాత్రమే సమయం ఉన్నందున ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకొని విధులు నిర్వహించాలన్నారు. అన్నమయ్య నూతన జిల్లాలో 2024 సంవత్సరం ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, రాజంపేట ఆర్డీవో రామకృష్ణ రెడ్డి, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

తెలుగు యువత అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ శాసనసభ్యులు దొమ్మలపాటి రమేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్న బాబు గారికి తోడుగా ఒక నియంతపై పోరాటానికి మేము సైతం రిలే నిరాహారదీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం తెలుగు యువత నాయకులు అర్ధనగ్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకో పాలన నుండి ఆంధ్ర రాష్ట్రానికి విముక్తి కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో యువ నాయకులు దొమ్మలపాటి యశశ్వి రాజ్, ఆర్.జె.వెంకటేష్, ఎస్.ఎం.రఫీ, మోడెం సిద్ధప్ప, తులసీధర్ నాయుడు, పట్టణ అధ్యక్షులు జోళపాలెం భవాని ప్రసాద్, ఉపాధ్యక్షులు యర్రబెల్లి వెంకటరమణారెడ్డి, బొమ్మిశెట్టి పురుషోత్తం, గుత్తికొండ త్యాగరాజు, చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో యావత్తు రాష్ట్రమే అండగా ఉంటుందని జనసేన నాయకులు తెలిపారు. బాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల రాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు జనసేన నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, పోలిశెట్టి శ్రీనివాసులు, జడ్డా శిరీష, భాస్కర పంతులు, చౌడయ్య, తోట వెంకటసుబ్బయ్య, వీరయ్య ఆచారి, రాఘవ మంగళవారం దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

రాజంపేట : అర్ధనగ్న నిరసన తెలుపుతున్న తెలుగు యువత, టిడిపి నాయకులు

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నందలూరు మండలం ఇసుకపల్లి చెయ్యేరులో టిడిపి ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ జనసందోహంతో పాల్గొన్నారు. అనంతరం మదనగోపాలపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

భవ్యశ్రీ కేసులో స్పందించని ఎస్ఐని సస్పెండ్ చేయాలి

- విసికె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసులు

మాట్లాడుతున్న విసికె పార్టీ రాష్ట్ర నేత పాలకుంట శ్రీనివాసులు

ప్రజాశక్తి -పీలేరు

చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని కావూరివారిపల్లి పంచాయతీలో నివాసముంటున్న వడ్డెర కులానికి చెందిన ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీ మృతికి కారుకులైన నలుగురు నిందితులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని విసికె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పీలేరు విసికె పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న భవ్యశ్రీ కనపడ్డంలేదని ఆ బాలిక తల్లిదండ్రులు పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, పోలీసులు సరిగ్గా స్పందించక నిర్లక్ష్య సమాధానాలతో వ్యవహరించడం వల్లే భవ్యశ్రీ హత్యకు గురైందని ఆరోపించారు. విద్యార్థిని మృతదేహం వినాయక నిమజ్జనం రోజున ఒక బావిలో కనపడ్డంతో పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, తూతూ మంత్రంగా విచారణ చేయడం చూస్తుంటే నిందితుల నుంచి పోలీసులకు ఎంత పెద్ద మొత్తంలో సొమ్ము అందిందో అన్న అనుమానం వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ పరిస్థితి పెత్తందార్ల అమ్మాయికి జరిగితే మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆగమేఘాల మీద బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించి చర్యలు తీసుకునే వారని చెప్పారు. ఇక్కడ హత్య కాబడింది వెనుకబడిన కులానికి చెందిన విద్యార్థిని కావడం వల్లే మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఇంత వరకు ఈ సంఘటనపై స్పందించలేదన్నారు. ఇది చాలా బాధాకర విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. భవ్యశ్రీ కేసులో స్థానిక ఎస్ఐ సరిగ్గా స్పందించి ఉంటే భవ్యశ్రీ హత్య అయ్యుండేది కాదని చెప్పారు. కావున, ఎస్ఐని తక్షణమే విధుల నుంచి తొలగించి ఈ కేసు ఇన్వెస్టిగేషన్ మరొక పోలీస్ అధికారికి అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వెంకటరెడ్డి, వంగమల్ల గురునాథ, పాలకుంట చౌడప్ప, హరినాథ పాల్గొన్నారు.

ఇంటర్నల్ హ్యాకథాన్ నిర్వహిస్తున్న విద్యార్థులు

'మిట్స్'లో 'ఇంటర్నల్ హ్యాకథాన్ 2023'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిట్స్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ 2023ని మంగళవారం నిర్వహించామని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్సు విద్యార్థులు వారి వారి నూతన పరిశోధన ఆలోచనలను ఇందులో ప్రదర్శించారన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023లో భాగంగా మన దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులకు వేదికను అందించడానికి, తద్వారా నూతన ఆవిష్కరణల సంస్కృతిని, సమస్య పరిష్కార ఆలోచనను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూ ఢిల్లీ వారు ప్రతి సంవత్సరం దేశం వ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ముందుగా కళాశాలలో ఇంటర్నల్ హ్యాక్‌థాన్ నిర్వహించి, అందులో ప్రతిభ కనపరిచిన వారు ఎస్ఐహెచ్ 2023 ఫైనల్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సుమారు 400 మంది విద్యార్థులు 70 బ్యాచ్‌లుగా ఏర్పడి 70 నూతన ఆలోచనలకు నాంది పలికినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చొక్కనాదం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం కోసం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నందలూరు మండలంలో ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని సీనియర్ సిటిజన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తాను హాజరై ప్రసంగించిన్నట్లు ఎన్.ముని గోపాలకృష్ణ తెలిపారు. జాతీయ సీనియర్ సిటిజన్ సమాఖ్య సమావేశం ముంబయిలో ఈ నెల 25వ తేదీ జాతీయ అధ్యక్షులు బదానే అధ్యక్షత నిర్వహించారని, ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తాను హాజరై ప్రసంగించిన్నట్లు తెలిపారు. నాలుగు జాతీయ సమస్యలను పరిష్కరించాలని సూచించడం జరిగిందని వెల్లడించారు. రైల్వే ప్రయాణంలో టికెట్ రాయితీ పునరుద్ధ రించాలని, వయోవృద్ధుల వేదింపుల నివారణకు చట్టాన్ని సక్రమంగా అమలు పరచాలని, మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ అఫ్ పేరెంట్స్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ బిల్ 2019 నుంచి నాలుగు సంవత్సరాలుగా పార్లమెంటులో అమలుకు నోచుకోలేదు, సవరణ ప్రవేశ పెట్టాలని పేర్కొన్నారు. వయోవృద్ధుల ఆరోగ్య విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక మంత్రిత్వశాఖను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని కోరారు. దీనిపై అధ్యక్షులు స్పందిస్తు వాటి అమలుకు గట్టి ప్రయత్నం చేస్తామన్నారు. మాజీ అధ్యక్షులు చాప్‌కే మాట్లాడుతూ ఏపిలో సీనియర్ సిటిజన్స్ సేవలను, ప్రభుత్వం ద్వారా పెన్షర్లుకు నెలకు రూ.2750 వయో వృద్ధులకు అందిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ ఎస్‌సిడిసి) ఆధ్వర్యంలో జిల్లా ఉన్న నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పనలో భాగంగా ఉద్యోగ మేళ నిర్వహిస్తామని ఎపిఎస్ఎస్‌సిడిసి జిల్లా నైపుణ్యా అధికారి బి.హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం విశ్వహిత డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఇందులో ఫ్లిప్కార్ట్, సెన్సార ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, డిహెచ్‌ఎల్, రైటర్స్ ఇన్ఫర్మేషన్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటారని తెలిపారు. దీనికి 18 నుండి 30 సంవత్సరాల వయసు కలిగి, ఎద్దైన డిగ్రీ, ఏద్దైన పీజీ, ఐటిఐ, డిప్లొమా,నర్సింగ్ పూర్తి చేసిన యువతి, యువకులు అర్హులని తెలిపారు. వీరికి నెలకు రూ.11 వేల నుండి రూ.25 వేల జీతం ఉండవచ్చని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఇంటర్వ్యూకు తమ బయో డేటా తీసుకొని, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకొని ఉదయం 9:00 గంటలకు హాజరై, ఉపాది పొందగలరని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ లింక్‌లో www.apssdc.in రిజిస్ట్రేషన్ చేసుకోగలరని, మరిన్ని వివరాలకు 8897776368, 6301612761 నెంబర్‌లను సంప్రదించాలన్నారు.

భూముల రీసర్వే పూర్తయ్యేదెన్నడో?

- 470 గ్రామాలకుగాను 107లో మాత్రమే పూర్తి
- ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వే ప్రక్రియ 2021 సంవత్సరంలో ప్రారంభించారు. జిల్లాలల్లో మాత్రం నత్త నడకనసాగుతుంది. ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలోని 470 రెవెన్యూ గ్రామాలుండగా 391 గ్రామాలలో డ్రోన్ సర్వే పూర్తి చేశారు.15,86,129 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 22,635 ఎకరాలలో రీ సర్వే 127 గ్రామాలలో మాత్రమే పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాలు, 470 రెవెన్యూ గ్రామాల్లో 38 మంది సర్వేయర్లు, 400 మంది విలేజ్ సర్వేర్లు ఉన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రీ సర్వే పూర్తి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మిగిలిన 363 గ్రామాల్లో, 1,563,494 ఎకరాలలో రీ సర్వే ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. మిగిలిన రీ సర్వేను డిసెంబర్ నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సర్వే నిర్వహించాల్సిన గ్రామాల్లోని రెవెన్యూ రికార్డులను ప్యూరిఫికేషన్ (స్వచ్ఛీకరణ) పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్ ఫ్లయింగ్ పూర్తవ్వడంతో ఆరోరిపై ఇమేజ్ (ఒఆర్) లు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నారు. ఆయా గ్రామల్లో గ్రౌండ్ ట్రూతింగ్ (భూ యజమాని డాక్యుమెంట్ల పరిశీలన), గ్రౌండ్ వాలిడేషన్ (భూమి విస్తీర్ణం నిర్ధారణ) ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అభ్యంతరాల పరిశీలనకు మండల తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దార్లను నియమించారు. మొత్తం ప్రక్రియను తహశీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు. నిర్ణీత భూముల హద్దుల్లో తేడా లేకుండా ఉండేందుకు రీ సర్వేకు రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. పలు ప్రాంతాల్లో భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. రైతుల వద్ద అంగీకార పత్రాలు తీసుకున్న తర్వాత పలువురు రైతులకు సంబంధించిన పాస్ బుక్‌లో తప్పులు, లోపాల సవరణకు వందల మంది రైతులు జిల్లా అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో 107 గ్రామాలలో మాత్రమే సర్వే చేయడానికి ఇంత సమయం పట్టింది. మిగిలిన గ్రామాలు పూర్తి కావాలంటే ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందో వేచి చూడాల్సిందే.

రైతుల సమక్షంలో రీసర్వే నిర్వహించాలి

కొన్ని గ్రామాలలో నాయకులకు ఉపయోగపడే గ్రామాలను ఎంపిక చేసుకొని రీ సర్వే చేస్తున్నారు. రీ సర్వే చేసిన మిగులు భూములను నాయకుల కబ్జా చేసుకుంటున్నారు .దీనివల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు. కొన్ని గ్రామాలలో డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్నారు. రీ సర్వే చేసేటప్పుడు చుట్టుపక్కల రైతులను సమక్షంలో రైతులకు హద్దులు చూపించి రీ సర్వే చేయాలి.

- సి.రామచంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, రాయచోటి.

డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం

ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొదటి విడత రెండో విడత ఈ సర్వే పూర్తి చేశారు. మూడు విడతలు ఈ మధ్యకాలంలోనే ప్రారంభించాం. ఈ సర్వే పై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వారానికి రెండుసార్లు సమీక్షిస్తున్నారు. వారి సహకారంతో డిసెంబర్ 23 నాటికి వంద శాతం పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రైతుల నుంచి ఎలాంటి సమస్యలు రాలేదు.

- టి.జయరాజ్, జిల్లా భూ రికార్డుల సర్వే శాఖ సహాయ సంచాలకులు, రాయచోటి.

ఉచిత వైద్య పరీక్షలు వినియోగించుకునేలా చర్యలు

ప్రజాశక్తి- రాయచోటి

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలు ప్రజలందరూ వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని, ఎంఇ ఎపిహెల్త్ మొబైల్ యాప్‌లో సమాచారాన్ని తప్పనిసరిగా నమోదుచేయాలని, బిపి, షుగర్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని పేర్కొన్నారు. చంటి పిల్లలు, గర్భిణులు, విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం లోని కాటిమాయకుంట గ్రామంలో ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. వైద్య పరీక్షల కోసం నలుగురు వైద్యులను ఏర్పాటు చేశామని అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రతి వైద్యుడి వద్ద తప్పనిసరిగా డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్, ప్రింటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య సురక్ష కేంద్రానికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వ్యక్తుల సమాచారాన్ని, వారి ఆరోగ్యానికి సంబంధించిన రిపోర్టులను ఏ విధంగా తీసుకుంటున్నారని అడగగా వైద్య అధికారులు దానికి సమాధానం ఇస్తూ వారి సమాచారాన్నిచ వారి ఆరోగ్యానికి సంబంధించిన రిపోర్టులను ఎంఇ ఎపిహెల్త్ మొబైల్ యాప్ లో అప్లోడ్ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సురక్ష కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న వైద్య పరీక్షల గురించి వైద్యులకు, ఇతర అధికారులకు కలెక్టర్ సూచనలిస్తూ వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రతి ఒక వ్యక్తికి కేసు షీట్ తప్పనిసరిగా ఉండాలలన్నారు. గర్భిణుల పరీక్షల నిమిత్తం గైనకాలజిస్టును కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇంకొక వైద్యుడు లేదా వైద్యురాలి సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆరోగ్య సురక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన 104 వాహనాన్ని పరిశీలిస్తూండగా వాహనంలో ఇసిజి పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య పరీక్షలను, మందులను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కేంద్రానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను, ఒక పిల్ల వాడిని వారి ఆరోగ్య సమస్యలను కలెక్టర్ అడగగా వారి సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ఒ కొండయ్య, డిసిహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, రాయచోటి ఎంపిడిఒ మల్‌రెడ్డి , గ్రామ సర్పంచ్ ఖాదర్‌వల్లి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

పెన్షన్ పెంపునకు కలెక్టర్ చొరవ

ప్రజాశక్తి - రాయచోటి

బాధితురాలి తల్లితో మాట్లాడుతున్న కలెక్టర్

మండలంలోని కాటిమాయకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ గిరీష మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజలతో వారి సమస్యలను తెలుసుకుంటుండగా కాటిమాయకుంటకు చెందిన పర్వీన్ అనే మహిళ కుమార్తె షేక్ మరియం విభిన్నప్రతిభావంతురాలు. ప్రస్తుతం వస్తున్న రూ.2 వేల పింఛను చాలడం లేదని కలెక్టర్‌కు వివరించారు. పింఛను పెంచితే తమ బిడ్డను పోషించు కుంటామని విన్నవించారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ వంద శాతం పింఛను పెంచి అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికా రులను ఆదేశించారు. వైద్య అధికారులు దీనిపై స్పందిస్తూ వెంటనే మెడికల్ బోర్డుకు పాప వివరాలు పంపి పూర్తి స్థాయి పింఛను అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు చెప్పారు. చొరవ తీసుకున్న కలెక్టర్‌కు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా? : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించమంటే పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాలకు పిలుపునిస్తే ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని ముందస్తు అరెస్టు చేయడం, ధర్నాకు వెళ్లకూడదని చెప్పడం సిగ్గుచేటన్నారు. నిజంగానే ప్రభుత్వానికి పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించి విద్యారంగాన్ని కేరళ తరహా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కనీసం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి చిన్నపాటి నిరసనలు తెలపడానికి ప్రకటించిన వెంటనే ప్రభుత్వం ఇచ్చిన మాటను తుంగలో తొక్కి విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడే ఇళ్ల దగ్గర పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్బంధాలను వ్యక్తిగత స్వేచ్ఛను హరించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు. డ్రగ్స్ మాఫియా, మహిళలను అక్రమ రవాణా, అత్యాచారాలు, హత్యలు, దళితులు, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు, మత్తు మాఫియా విచ్చలవిడిగా పేట్రేగిపోతోందని, ప్రభుత్వం, పోలీసులు వాటి పైన చర్యలు చేపట్టకుండా విద్యార్థి నాయకులపై ప్రతాపం చూపెడుతున్నారని విమర్శించారు. విద్యారంగా సమస్యల పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద శాంతియుతమైన ధర్నాలకు పిలుపునిచ్చిన వెంటనే ఎస్ఎఫ్ఐ ప్రధాన నాయకత్వాన్ని, ముఖ్య కార్యకర్తలను నిర్బంధించడం వల్ల ఒరిగేది ఏముండదని పేర్కొన్నారు. ఆంధ్రపదేశ్‌ను నిర్బంధ ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాల సముదాయ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల స్థాయిలో రెండు రోజుల పాఠశాల సముదాయ శిక్షణలో భాగంగా మంగళవారం మొదటి రోజు ప్రాథమికోన్నత పాఠశాల సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక అయ్యప్ప రెడ్డి కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు సంబంధించి శిక్షణ జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి వై. లోకేశ్వర్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులకు అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమం పీలేరు మండలంలోని ప్రాథమికోన్నత తరగతులు బోధించు ఉపాధ్యాయులకు పట్టణంలోని అయ్యప్ప రెడ్డి కాలనీ, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) లలో మంగళవారం జీవ శాస్త్రం, తెలుగు, గణితం సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ జరుగుతోందని, మిగతా సబ్జెక్టులకు బుధవారం ఉంటాయని అన్నారు. ఈ శిక్షణలో క్లాస్ రూమ్ లో ఉపాధ్యాయులు బోధించేటప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలి, కృత్యాలు ద్వారా బోధన ఎలా చేయాలి, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు రూపొందించడంలో ఉత్తమ పద్ధతులు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. మండల విద్యాధికారి-2 బి. పద్మావతి శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు అకాడమిక్ క్యాలెండర్ ను ఫాలో కావాలని పేర్కొన్నారు. శిక్షణ జరుగుతూన్న విధానం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అయ్యప్ప రెడ్డి కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఫౌజీయా బేగం మాట్లాడుతూ జీవ శాస్త్రానికి సంబంధించి తమ పాఠశాలలో పాఠశాల సముదాయ శిక్షణ జరుగుతుందని ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు బోధనలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గ్రూప్ డిస్కషన్ ద్వారా చర్చించి మంచి ఫలితాలను విద్యార్థులకు అందించేలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఉపాధ్యాయులు వీక్షించి బోధనా సామర్థ్యాన్ని పెంచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గా కె.సుదర్శన్, కె.శివశంకర్, జానం సుజాత, మండలంలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

కలెక్టరేట్ కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్ట్ భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం మూడు ఖాళీలున్నాయని ఏదేని పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు పని అనుభవం ఉండాలని పేర్కొన్నారు. డేటా అనాలసిస్ ప్రజెంటేషన్ స్కిల్ సోషల్ మీడియా తదితరాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. స్టైఫండ్ కింద నెలకు రూ.55 వేలు చెల్లిస్తారని చెప్పారు. దరఖాస్తును పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా ముఖ్య ప్రణాళిక అధికారి వారి కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం వెనుక భవనం, రాయచోటి, అన్నమయ్య జిల్లా చిరునామాకు పంపించాలన్నారు. ఈనెల 30 లోగా దరఖాస్తులను పంపించాల్సిఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9701200433, లేదా desoannamayya@gmail.comకు సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సిఐ నాగేంద్ర

పోలీసుస్టేషన్‌లో సిఐ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీసుస్టేషన్‌ను సిఐ నాగేంద్ర అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో సిఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సమయపాలన పాటించి, కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. సిబ్బంది హాజరు పరిశీలించినట్లు తెలిపారు. గ్రామాలలో చోరీలు, జూదం, నాటుసారా వంటి కార్యకలాపాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేయాలన్నారు. రాత్రి వేళల్లో బీట్‌లు సక్రమంగా నిర్వహించి, ప్రజా సంక్షేమానికి పాటు పడాలని సూచించామన్నారు. ఎస్‌పి సూచనల మేరకు నేర చరితుల చిత్రప టాలను తయారు చేసి స్టేషన్‌లో ఉంచామన్నారు. రోడ్డు భద్రతా నియమాలను కాపాడేందుకు ప్రమాదాలు నివారించడం కోసం భారీకేడ్లను తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిప్పేస్వామి, కానిస్టేబుల్ హరిబాబు, పోలీస్ సిబ్బంది లక్ష్మీనారాయణ, ముత్యాలయ్య ,రామ్మో హన, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నేడు బి.కొత్తకోట మండల సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం నేడు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించనున్నారన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు. **గాలివీడులో :** ఎంపిపి ప్రభావతమ్మ అధ్యక్షత మండల సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ శేఖర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

ఉద్యోగులు సమయపాలన పాటించాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గ్రామ సచివాలయాలలో పని చేసే ఉద్యోగులు సమయ పాటించాలని డిఎల్‌పిఒ పార్వతి పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పెనగలూరు మండలంలో పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఓబిలి, అనంతంపల్లి గ్రామ సచివాలయాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వరప్రసాద్ ఎఒ పద్మభూషణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిధిలోని కె.బుడుగుంటపల్లి పంచాయతీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలోని క్రీడా మైదానంలో మంగళవారం ఎస్‌జిఎఫ్ఐ కో-ఆర్డినేటర్ డేవిడ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ క్రీడల్లో నైపుణ్యం కనపరిచిన జట్టును జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాల నుంచి పది జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో టెన్నికాయిట్, షటిల్ బ్యాట్మింటన్, త్రోబాల్, యోగ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలోవ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ రాజు, పిఇటిలు భాస్కర, సుబ్రహ్మణ్యం, చంద్రకుమార్, ప్రదీప్, రాధారాణి, లక్ష్మి దేవి పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: RAJAMPET

S.O.P.NO: 3 /2023

1. Mogal Moula Basha, S/o. Hussain Saheb, D.No.7/761, Vinayaka Nagarstreet, Rly. Kodur Town and Mandal, Annamayya District.
2. Shaik Arshiya Moulana Hussaian, W/o. Shaik Khadarvalli, Plot No. G5Janapriya Apartments Block 10, Mohan Nagar, Saroor Nagar, Ranga reddy District, Telangana.
3. Shaik Shaheena, W/o. Shaik Khadarvalli, 10-209, Y.S.R Quarters, Rly.Kodur Town & Mandal, Annamayya District.
4. Mogal Sona, W/o. S. Nagur Basha, aged 23 years, Muslim, House wife,residing at D.No. 7/761, Vinayaka Nagar street, Rly. Kodur Town & Mandal,Annamayya District.
5. Mogal Heena, D/o. Moula Basha, D.No. 7/761, Vinayaka Nagar street,Rly. Kodur Town & Mandal, Annamayya District.
6. Mogal Mahammad Hussain, S/o. Moula Basha, D.No. 7/761, VinayakaNagar street, Rly. Kodur Town &Mandal, Annamayya District.

...Petitioners

Vs

Nill. ...Respondents

GENERAL NOTICE

పైన తెల్పిన పిటీషనర్లు లాకర్ నెంబరు 4/6 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రైల్వేస్టేషన్ రోడ్ రైల్వే కోడూరు బ్రాంచ్ రైల్వే కోరూడు టౌన్‌లో మొగల్ కార్ మున్ భీ పేరుతో వుండు లాకర్ను ఉపయోగించుట కొరకు పై కోర్టులో పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు.ఎవరికైనా ఎలాంటి అక్షేపణలు ఉన్న ఎడల 31.10.2023 వ తేదీన ఉదయం 10-30 నిముషాలకు స్వయంగా కాని లేక లాయర్ ద్వారా కాని హాజరై మనవి చేసుకోవలసిందిగా ఇందు మూలంగా తెలియచేయదమైనది.

//By Order of the Court//

బి.వి.రమణ,
జి.సురేంద్ర
అడ్వకేట్స్, రాజంపేట.

ఉపసంచాలకులుగా జాకీర్ హుస్సేన్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులుగా డి.జాకీర్ హుస్సేన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలం పాటు అన్నమయ్య జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారిగా పనిచేశానని చెప్పారు. విజయవాడలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ ఉపసం చాలకులుగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ గిరీషను మర్యాద పూర్వకంగా కలిశారు. సాంఘిక సంక్షే అభివృద్ధికి తన బాధ్యతలను సక్రమంగా నిర్వరిస్తానని చెప్పారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగన్వాడీల అక్రమ అరెస్టులకు నిరసనగా మంగళవారం అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు మధురవాణి, కార్యదర్శి గంగా దేవిలు మాట్లాడుతూ వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు, తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం హామీలిచ్చి మాట తప్పిందని విమర్శించారు. ధర్నాకు అనుమతి కోరినా పోలీసులు నిరాకరించారని తెలిపారు. విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను రాష్ట్రవ్యాపితంగా ఎక్కడికక్కడ అరెస్టు చేశారని, నిర్భంధించారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌లలోకి మహిళలనే విచక్షణ కూడా చూడకుండా పోలీసులు అమా నుషంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీలు, ఉద్యోగులు, కార్మికుల గొంతునొక్కడం పచ్చి నిరంకుశత్వం తప్ప మరొకటి కాదని వెల్లడించారు. (అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీల కోర్కెలను ఆమోదిస్తూ ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే వైసిపి ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సభ్యులు విజయ,సుజనా, వాణి, శైలజ పాల్గొ న్నారు. **నిమ్మనపల్లె :**అంగన్వాడీ కార్యకర్తలు, మిని కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అంగన్వాడీ వర్కర్ల సంఘం ఆధ్వ ర్యంలో తహశీల్దార్ సి.ఆర్‌మంజులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భం వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని, ఎఫ్ఆర్ఎస్ వివిధ రకాల యాప్ అన్ని రద్దుచేసి ఒకే యాప్ ద్వారా అంగన్వాడీ పనులను చేసేలా చర్యలు తీసుకోవాన్నారు. మినీ సెంటర్ మెయిన్ సెంటర్‌లో మార్చి మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, పదవీవిరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలి, నాణ్యమైన సరుకులు లబ్ధిదారులకు సరిపోయేంతగా సరఫరా చేయాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గీత, రెడ్డమ్మ, ముంతాజ్ బేగం, అకీరునిసా, శ్యామల పాల్గొన్నారు. **పెద్ధమండ్యం :**అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం మండలంలోని 17 పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నా, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎస్.స్వరూపరాణి, వసంతమ్మ, బాలసరస్వతి, పార్వతి, మండలం లోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మదనపల్లి : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పెద్దమండ్యం : మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

'నా మట్టి-నా దేశం' కార్యక్రమానికి శ్రీకారం

కలికిరి : మట్టి కలశంతో విద్యార్థులు, కమాండర్ వై.వి.రెడ్డి

ప్రజాశక్తి-బి కొత్తకోట

మండలంలోని బయ్యప్పగారిపల్లి పంచాయతీలో నా మట్టి - నా దేశం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టంగా చేపట్టిన నామట్టి నాదేశం కార్యక్రమాన్ని బయ్యప్పగారిపల్లి సర్పంచ్ రామ్మోహన్ ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి కలశ పూజలు చేశారు. స్వతంత్ర సమరయోధులు త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ మట్టిని మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పంపించడం జరిగిందని అక్కడ నుంచి ఢిల్లీ రాజధానికి పంపించడం జరుగు తుందని సర్పంచ్ తెలి పారు. ఈ బృహత్కర కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. పెద్దతిప్పసముద్రం మండలం మడుమూరు పంచా యతీలో సర్పంచ్ నాగరత్న, భాస్కం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్ర మంలో పంచాయతీ సెక్రటరీ, అగ్రికల్చర్ ఆఫీసర్ పాల్గొన్నారు. పాల్గొన్నారు. **కలకడ :** అమృత కలశయాత్ర ఎంపిపి శ్రీదేవిరవికుమార్ ఆధ్వర్యంలో మండ లంలో ఘనంగా నిర్వహించారు.అమృతకలస్ యాత్రలో భాగంగా మేర నామట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా పంచాయతీలో పలు గ్రామాల నుంచి మట్టిని, బియ్యాన్ని సేకరించి వాటిని ర్యాలీగా తీసుకువచ్చి ఎంపిడిఒ కార్యాలయంలో చేర్చారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎర్రయ్యగారిపల్లి సచివాలయం సెక్రటరీ పవన్ కుమార్, వైసిపి నాయకులు ఆర్ వెంకటరమణ, ఎఎన్ఎం అంజలిదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, డప్పుకళాకారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** మేరా మట్టి మేర దేశ్ కార్యక్రమం ఐటిబిపి 53వ బెటాలియన్ ఆధ్వర్యంలో మండలం లోని గుట్టపాలెం పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. ఐటిబిపి కమాండెంట్ అమిత్ బాటీ ఆదేశాలు మేరకు కమాండర్ వై.విరెడ్డి ఆధ్వర్యంలో మట్టిని సేకరించి ఢిల్లీలో నిర్మిస్తున్న కర్తవ్య పత్‌కు పంపడానికి కలశ యాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరెడ్డి, కార్యదర్శి గోపి పవిత్ర స్థలం నుంచి తెచ్చిన మట్టిని కలశంలో వేశారు. కార్యక్రమంలో ఎంపిపి, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి-కలకడ

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ తిప్పేస్వామి సూచించారు.మంగళవారం మండలంలోని కదిరాయచెరువు పంచాయతీలోని వివిధ గ్రామాలలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించు కోవాలంటే హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో సహాయపడుతుందని అన్నారు. ఈ మధ్యకాలంలో ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా పోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన తలలో ఉన్న సున్నితమైన అవయవం మెదడు దెబ్బ తినకుండా ఉంటే మిగిలిన శరీర భాగాలు గాయాలైన కోలుకునేందుకు వీలుగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రమేష్, డ్రైవర్ రమేష్, మహిళా పోలీస్ గిరిజ, ద్విచక్ర వాహన దారులు పాల్గొన్నారు. **కలికిరి :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రహీముల్లా పేర్కొన్నారు. స్థానిక ఎల్లమ్మగుడి సమీపంలో ట్రాఫిక్ నిబంధనల పట్ల వాహనదారులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన త్రిపుల్ రాష్ రైడింగ్ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపకూ డదన్నారు. పట్టణములో వాహనాలను 40 కి.మీలకు మించి వేగంగా నడుప కూడదని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ వాహ నాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులుగాని, ఇతరులు గానీ వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులపైన కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదనాచారి, రైటర్ మనోహార్, హెచ్‌సి రఫీ, మునిరత్నం పాల్గొన్నారు.

కలకడ : ద్విచక్రవాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి : ఎంపిపి

పుల్లంపేట :మాట్లాడుతున్న ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ సభాభవనంలో మంగళవారం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పోషకాహార మాస ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ పోషకాహారం గురించి మన పెద్దలు మంచిగా జొన్నలు రాగులు, సజ్జలు నూగులు ఇలా సాంప్రదాయ వంటకాలు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. ఇప్పుడు పోషకాహార లోపం వల్ల మన చేతులారా మన ఆరోగ్యాన్ని మనమే పాడు చేసుకుంటున్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు చిన్నపిల్లలు అందరూ రక్తహీనతకు గురికాకుండా మంచి పోషకాహారం తీసుకోవాలని, ఐసిడిఎస్ సిబ్బంది వారు అందిస్తున్న పోషకాహారాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల ఎంపిడిఒ రఘురాం, డాక్టర్, సిడిపిఒ, ఏసి డిపిఒ అధికారులు మాట్లాడుతూ పౌష్టికాహారం, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ఎంపిటిసి చంగయ్య, ఎంపిడిఒ రఘురాం, డాక్టర్ సానే శేఖర్, రైల్వే కోడూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సౌభాగ్యమ్మ, ఎసిడిపి సరలాదేవి, సూపర్వైజర్స్ ఒ.మణెమ్మ, ఎం జయలక్ష్మి, వై నిర్మలాదేవి, సుదర్శన్ రెడ్డి, పార్థసారథి, మండల అంగన్వాడీ టీచర్స్, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలు పాల్గొన్నారు. **రామాపురం:** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సిడిపిఒ పద్మావతి అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిడిగారిపల్లి గ్రామ సచివాలయం పరిధి లోని అంగన్వాడీ కేంద్రం వద్ద మంగళవారం చిరుధాన్యాలు ఎలా వంట చేయాలని విషయంపై తల్లులకు, బాలింతలకు వాలంటీలకు గ్రామ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు వి పద్మజ. హుస్సేన్ మ్మ. పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ. అంగన్వాడి కార్యకర్త వాలంటీర్లు మహిళలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు 11 మంది ఎంపిక

పుల్లంపేట : నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు ప్రభుత్వ హై స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన నియోజవర్గ స్థాయి పోటీలలో పుల్లంపేట మండలం కొత్తపేట పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల పీడీ బాలశేఖర్ తెలిపారు. బాల్ బాడ్మింటన్ నుంచి 5 మంది విద్యార్థులు, వాలీబాల్ నుంచి ఇద్దరు విద్యార్థులు, ఖోఖో నుంచి ఇద్దరు విద్యార్థులు, షటిల్ బ్యాట్మెంటన్ నుంచి ఇద్దరు విద్యార్థులు తమ పాఠశాల నుంచి ఎంపిక అయ్యారని తెలిపారు.ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మరొకరు..

మండల పరిధిలోని జడ్‌పిహెచ్ఎస్ కొత్తపేట పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని జి. శ్రీజ జిల్లాస్థాయి అండర్-19 ఎస్‌జిఎఫ్ఐ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. మైదుకూరు మేధా ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం జరిగిందని పాఠశాల పీడీ బాల శేఖర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు

శిథిలావస్థలో రెవెన్యూ కార్యాలయం

ప్రజాశక్తి -తంబళ్లపల్లె

మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనాన్ని 1981లో నిర్మించారు. అప్పటికి రెవెన్యూ శాఖమంత్రి నేదురమల్లి జనార్ధన్‌రెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొని ఏమాత్రం వర్షాలు కురిసిన భవనం పై కప్పు వుడి పడుతుంది. ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు భయం గుప్పెట్లో నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ భవనం పై నిర్మాణం పై పలుమార్లు పత్రికల్లో రాసిన ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా ఈ భవనాన్ని తొలగించి నూతన భవనానికి చర్యలు చేపట్టాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

పెచ్చులూడిన కార్యాలయంలోని గది

వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

29న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈనెల 29న విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం జయరామయ్య పిలుపునిచ్చారు. ఓబుళవారిపల్లె మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 29వ తేదీన విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు సంబంధించి గోడ పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నాగిపోగు పెంచిలయ్య, రైతు సంఘం నాయకులు సి.హరి, రమణ భవన నిర్మాణ శాఖ నాయకులు చెన్నకేశవులు, పందెటి శివకుమార్‌రాజు, గిరిజన నాయకులు సుబ్బు, రాఘవలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా సురేంద్రరెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

సురేంద్రరెడ్డి

విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా సురేంద్ర రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయి నూతన కార్యవర్గ ఎన్నికలు, సెప్టెంబర్ 25వ తేదీ, సూర్య కళామందిర్ కాకినాడలో జరిగాయి. రాష్ట్రస్థాయి కార్యవర్గ సభ్యులు మొత్తం 36 మంది మూడు సంవత్సరాల కాల పరిమితికి ఏకగ్రీవంగా ఎన్నికల అధికారి రామారాయుడు, ఆధ్వర్యంలో ఎన్నుకోబడ్డారని, రాష్ట్ర అధ్యక్షులుగా పిఎస్ఎస్ఎన్‌పి శాస్త్రి, జనరల్ సెక్రటరీగా లక్ష్మీనారాయణ ట్రెజరర్‌గా నాగరాజు ఎన్నికయ్యారు. రాష్ట్ర సెక్రటరీగా అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్, మండల వ్యవస్థాపక కార్యదర్శిగా సేవలందిస్తున్న సి. సురేం దర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల కలికిరి విశ్రాంత ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షులు అబ్దుల్ ఖాదర్, అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

బోధన సామర్థ్యాలు పెంపొందేలా చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాలు పెంపొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఇఒ నారాయణ తెలిపారు. మంగళవారం అందులో భాగంగా రెడ్డివారిపల్లె హైస్కూల్లో సిఆర్‌సి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబోధనలో సాంకేతికతను అందుపు చ్చుకోవాలన్నారు. డిజిటల్ పద్ధతుల్లో మెరుగైన బోధన చేయాలన్నారు. ముఖ్యంగా సైన్స్, గణితం సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విద్యార్థు ల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలన్నారు. కోర్ సబ్జెక్టులకే స్టడీ లపై మరింత దృష్టి పెట్టాలన్నారు. పాఠ్యాంశాలలో బహుళ ఎంపిక ప్రశ్నలను సృష్టిం చాలన్నారు. అకాడమిక్ కాలెండర్ రూపొందించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

ప్రజాశక్తి-గాలివీడు

విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి రాధామాధవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బిసి బాలికల వసతి గృహంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్ష చేసి వైద్య సలహాలు అందించారు. విద్యార్థినిలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య వస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, 112, 121 లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ రాధికారెడ్డి, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ శివజ్యోతి, ఎఎన్ఎంలు ఆనందజ్యోతి సుశీల, జిఎంఎస్‌కె షబానా, ల్యాబ్ టెక్నీషియన్ బాలయ్య, ట్యూటర్ లక్ష్మీ ప్రసన్న వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధామాధవి

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో నివాసముంటున్న చాకలి వెంకటసుబ్బన్న (73) కస్తూర్బా పాఠశాల సమీపంలో ఎడమవైపు నడుచుకుంటూ బి.కొత్తకోట వైపు వెళుతుండగా, అతని వెనుక వైపు నుండి గట్టు సమీపంలో గల మొరంపల్లికి చెందిన భాస్కర్ ద్విచక్ర వాహనంలో అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ముందువైపు వెళుతున్న వెంకటసుబ్బన్నను ఢీకొట్టాడని తెలిపారు. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బన్న క్రింది పడిపోయి కుడి మోచేయి, ఎడమ మోకాళ్ళకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ద్విచక్ర వాహనంలో వచ్చిన భాస్కర్ అనే వ్యక్తికి నుదుటిపైన రక్త గాయమైందన్నారు. స్థానికులు గమనించి 108 అంబులెన్సుకి సమాచారమ్విగా గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

భార్య, మామపై అల్లుడు కత్తితో దాడి

- మదనపల్లె ఆస్పత్రికి తరలింపు - పరిస్థితి విషమం

ప్రజాశక్తి-ములకలచెరువు

కట్టుకున్న భార్య, మామ పై అల్లుడు విచక్షణ రహితంగా కత్తితో పొడిచి హత్యాయత్నం కు ప్రయత్నించిన సంఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ములకలచెరువు మండలం, దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లికి చెందిన చంద్ర శేఖర్, వసంతమ్మ కుమార్తె అపూర్వ (25), అదే గ్రామానికి చెందిన దాసు కుమారుడు దేవరాజుతో ఏడేళ్ల క్రితం ప్రేమ పెళ్లి జరిగిందన్నారు. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. టమోటా డబ్బులు రెండు లక్షలు రూపాయలు తమకు తెలియకుండానే తీసుకున్నాడని మామ అడగడంతో పలుమార్లు గొడవ పడినట్లు తెలిపారు. దేవరాజు అత్తారింటి నుంచి బయటకు వచ్చి వేరుగా కాపురం పెట్టాడు. ఇదే విషయంపై లో కక్ష్య సాధింపు ధోరణిలో మంగళవారం ఉదయం మాట్లాడాలని పిలిచి పథకం ప్రకారం తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడని చెప్పారు. అడ్డుకోబోయిన మామను కూడా కత్తితో దాడి తీవ్రంగా గాయపరిచాడని తెలిపారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రథమ చికిత్సల అనంతరం మదనపల్లికి అక్కడ నుంచి తిరుపతికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ములకలచెరువు ఇన్‌ఛార్జి శివాంజనేయులు, ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈఘటనపై ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.